# హాస్టళ్లలో అన్నీ సమస్యలే..

- నీళ్లు లేవు.. కాస్మోటిక్ చార్జీలకు డబ్బులు లేవు
- బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గదరాజు చందు, కోతి విజయ్

జనగామ రూరల్, డిసెంబర్ 1: హాస్టళ్లలో అనేక సమస్యలు తిష్ట వేశాయని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గదరాజు చందు, ఉపాధ్యక్షుడు కోతి విజయ్ అన్నారు. ఆదివారం జనగామ మండలంలోని పెంబర్తి గ్రామంలోని మహాత్మాజ్యోతిబాపూలే బాలికల పాఠశాల, కళాశాల హాస్టళ్లను సందర్శించారు. వారి సమస్యలను తెలుసుకుందామని వెళ్లగా గేటు ముందే ఆపి కొందరు విద్యార్థులతో మాట్లాడించారని తెలిపారు. ప్రిన్సిపాల్ పొంతనలేని సమాధానం చెప్పారని, ముందుగానే అన్ని వసతులు బాగున్నాయని చెప్పాలని విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారన్నారు. అయినప్పటికీ కొందరు విద్యార్థులు లోపల బెడ్స్ లేవని, వాటర్ సమస్య ఉందని తెలిపారన్నారు. గతంలో ఇక్కడ ఫుడ్ పాయిజన్ జరిగిందని, కోతుల బెడద ఉందని, ఆరు నెలల నుంచి కాస్మోటిక్స్ చార్జీలు చెల్లించడం లేదని, తల్లిదండ్రులను కలవడానికి కూడా ఆంక్షలు పెడుతున్నారని చెప్పారన్నారు. జూలై నుంచి మెస్ బిల్లులు రాలేదని ప్రిన్సిపాల్ తెలిపారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ముస్త్యాల దయాకర్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్, మండల మహిళా అధ్యక్షురాలు రేఖ రాజు, బీఆర్ఎస్ నాయకులు కొమ్ము రాజు, యాకూబ్, తన్వీర్, సురేశ్, నవీన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.



పెంబర్తిలోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల గేటు ఎదుట విద్యార్థులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకుడు గదరాజు చందు

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

హాస్టల్ పరిశీలనకు అనుమతివ్వకపోవడం విడ్డూరం

- ఏం చేశారని కాంగ్రెస్ సర్కారు విజయోత్సవాలు
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్

మహదేవపూర్, డిసెంబర్1: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనంతో పాటు నాణ్యమైన విద్యనందించాలని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. కాంగ్రెస్ ప్రజా వంచన దినాల్లో భాగంగా మండల కేంద్రంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వసతులు, సౌకర్యాలపై పరిశీలించేందుకు మధూకర్ ప్రయత్నించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతి లేదని సిబ్బంది తెలపడం గమనార్హం. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలు, వసతులపై హాస్టల్‌ను పరిశీలించేందుకు అనుమతి ఇవ్వకపోవడం విడ్డూరమన్నారు. గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారని, వారి సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత రేవంత్ సర్కారుకే దక్కిందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో ప్రజలకు ఏం చేశారని విజయోత్సవాలు చేసుకుంటున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. మ్యానిఫెస్టో కమిటీకి చైర్మన్‌గా 420 హామీలకు రూపకల్పన చేశామని గొప్పలు చెప్పుకునే మంథని ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో ఏ ఒక్క పథకం అమలు చేయలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు, మాజీ సర్పంచ్‌లు శ్రీపతి బాపు, నాగుల లక్ష్మారెడ్డి, పద్మారవీందర్ రెడ్డి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కేదారి గీతాబాయి, మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్నామల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సల్మాన్ ఖాన్, సీనియర్ నాయకులు పోత వెంకటస్వామి, పెండ్యాల మనోహర్, అన్కారీ ప్రకాశ్, కారెంగుల బాపురావు, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు జక్కయ్య, బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు ఎండీ అలీంఖాన్, జాగృతి మహేశ్, సుంకె మధు తదితరులు పాల్గొన్నారు.



ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు



జాకారం హాస్టల్‌లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న నాగజ్యోతి, రాకేశ్‌రెడ్డి

- పిల్లలు చనిపోతున్నా ప్రభుత్వానికి పట్టింపులేదా?
- మెనూలో నాణ్యత పాటించాలి
- విద్యార్థుల సంక్షేమాన్ని గాలికొదిలేసిన సర్కారు
- గురుకుల బాటలో బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి నాగజ్యోతి

### దేశ భవిష్యత్ కర్మాగారాలు గురుకులాలు

దేశ భవిష్యత్ కర్మాగారాలు గురుకులాలు. అందులో విద్యార్థులను మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారు చేయాలి. కాస్మోటిక్స్, దుప్పట్లు సరిగా లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఇది ఎంతో బాధాకరమైన విషయం. విద్యార్థులను కన్న బిడ్డల్లా చూసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వారి సంక్షేమాన్ని గాలికి వదిలేసింది. గిరిజన, ఆదివాసీ బిడ్డలు సొంత ఇల్లుగా భావించే ఆశ్రమ పాఠశాలలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. మంత్రి సీతక్కకు రాష్ట్రం మొత్తం తిరిగే సమయం ఉంది కాని ఆమె సొంత నియోజకవర్గంలోని గురుకులాలను సందర్శించే తీరిక లేదు.

– జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి

గురుకులాల్లో లోపిస్తున్న పారిశుధ్యం

# చలికి వణుకుతున్నా దుప్పట్లివ్వరా?



చల్వాయిలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేసిన రాకేశ్‌రెడ్డి, నాగజ్యోతి

ములుగురూరల్/గోవిందరావుపేట, డిసెంబర్1: విద్యార్థులు చలికి వణుకుతున్నా దుప్పట్లివ్వరా అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగు రాకేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు ఆదివారం నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దమ్మ రమేశ్, స్థానిక నాయకులతో కలిసి జాకారంలోని సోషల్ వెల్ఫేర్, బండారుపల్లి రెసిడెన్షియల్ గురుకులాలతో పాటు గోవిందరావుపేట మండలంలోని చల్వాయి కస్తూర్బా పాఠశాలను సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అక్కడ పారిశుధ్యం లోపించడాన్ని గమనించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులను చేపట్టకుంటే విద్యార్థులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. వంట గదులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూపై ఆరా తీసి, నాణ్యత పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా రాకేశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదవుతున్నా విద్యాశాఖ మంత్రి లేరని, విద్యా వ్యవస్థను సర్కారు నాశనం చేస్తున్నదని అన్నారు. రేవంత్‌రెడ్డికి ఇంకా ముఖ్యమంత్రి అయిన మురిపెం పోలేదని, పాలనపై పట్టు కోల్పోయి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలను నిర్వీర్యం చేయాలని కుట్ర చేస్తున్నదని, వరుస మరణాలు, ఆహార విషతుల్యం జరుగుతున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని పేర్కొన్నారు. వంటశాలలు, మరుగుదొడ్లు, మూత్రశాలలు అధ్వానంగా ఉన్నాయని అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో గురుకులాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని, ఆయన ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్‌రెడ్డి రాజకీయ పంతంతో విద్యార్థుల భవిష్యత్‌తో ఆటలాడుతున్నారని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 10 నెలల్లోనే 49 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోవడం, 1200 మంది తీవ్ర అస్వస్థతకు గురవడం విచారకరమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తల్లి పాత్రలో ఉన్న జిల్లా మంత్రులు కొండా సురేఖ, సీతక్క రాజకీయ ప్రకటనలు చేస్తూ పిల్లలు, తల్లిదండ్రుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. కాగా, జాకారం, చల్వాయిలోని హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ మాజీ చైర్మన్ గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పోలెపు శ్రీనివాస్, నర్సింహానాయక్, జాకారం మాజీ సర్పంచ్ రమేశ్, మాజీ ఎంపీటీసీలు గొర్రె సమ్మయ్య, విజయ్‌రామ్‌నాయక్, అన్న తిరుపతి, గండి కుమార్, రాసమల్ల సురేందర్, కోగిల మహేశ్, భూక్యా జంపన్న, ఆదిరెడ్డి, రాజేందర్, స్వరూప, నాయకులు పూర్ణచందర్, బైకాని ఓదెలు, భూరెడ్డి మధు, బొల్ల ప్రసాద్, రమేశ్, కనకయ్య, బీఆర్ఎస్వీ కేయూ నాయకులు కొనుకంటి ప్రశాంత్, సాయిని రాకేశ్, కొమరం సిద్ధు, సాదబోయిన రాజ్‌కుమార్ ఉన్నారు.

## ఆన్‌లైన్ ప్రేమ విఫలమై యువకుడి ఆత్మహత్య




వినయ్(ఫైల్)

నెక్కొండ, డిసెంబర్ 1: ఆన్‌లైన్ ప్రేమ విఫలమవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన ఘటన నెక్కొండ మండలం అప్పల్‌రావుపేటలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జిల్లా వినయ్(25) ఉపాధి కోసం హైదరాబాద్‌కు వెళ్లి ఓ కంపెనీలో పని చేస్తున్నాడు. వినయ్‌కు ఇన్‌స్టాగ్రామ్‌లో చిత్తూరు జిల్లాకు చెందిన ఓ యువతితో ఏర్పడిన పరిచయం కాస్తా ప్రేమకు దారితీసింది. తను ప్రేమించిన యువతికి మరో వ్యక్తితో పెళ్లి జరగడంతో మనస్తాపానికి గురైన వినయ్ హైదరాబాద్‌లో ఐదు రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిమ్స్‌లో చికిత్సపొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# శ్రీనివాసరెడ్డి సేవలు మరువలేనివి

- 60 లక్షల మంది బీఆర్ఎస్ కుటుంబసభ్యులకు ఆప్తుడు
- పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్



శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మధుసూదనాచారి, దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపునేని నరేందర్ తదితరులు

హనుమకొండ, డిసెంబర్ 1 : అరవై లక్షల మంది బీఆర్ఎస్ కుటుంబ సభ్యులకు ఆప్తుడు మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి అని, ఆయన 20 ఏళ్ల పాటు సేవలందించినందుకు పార్టీ ఎప్పటికీ రుణపడి ఉంటుందని పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఆదివారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శ్రీనివాస్‌రెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. శాసనమండలిలో ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరైన ఈ కార్యక్రమంలో వినయ్ భాస్కర్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ వెన్నంటి నడిచి, పార్టీకి సుదీర్ఘ కాలం సేవలందించిన మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన తొలి, మలిదశ ఉద్యమకారుడని, ప్రభుత్వ ఉద్యోగిగా, తెలంగాణభవన్ ఇన్‌చార్జిగా, ఎమ్మెల్సీగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఆయన పార్టీకి సేవలం దించడంలో తోడ్పడిన కుటుంబ సభ్యులకు వినయ్ భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. ఓరుగల్లు బిడ్డగా శ్రీనివాసరెడ్డి ఉద్యమ వ్యాప్తికి, బీఆర్ఎస్ పార్టీకి ఎంతగానో తోడ్పాటునందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు మెమెంటో అందించి, శాలువాతో సత్కరించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన గులాబీ శ్రేణులు శ్రీనివాసరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సన్మానించాయి.



వాజేడు : ధర్మవరం గ్రామంలో వర్షానికి ధాన్యం తడవకుండా కప్పిన పరదాలు



నర్సింహులపేట : కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పుతున్న రైతులు

# అకాల వర్షం.. అన్నదాత ఆగం..

తుపాన్ కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పలుచోట్ల ఆదివారం వర్షం కురిసింది. దీంతో చేతికొచ్చిన వరి పంటతో పాటు పత్తి, ధాన్యం తడిసి ముద్దయ్యింది. రెండు రోజులుగా ఆకాశం మబ్బులు పట్టి చల్లగాలులు వీస్తుండడంతో కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన వడ్లు తడవకుండా పలువురు రైతులు టార్పాలిన్లు కప్పుకున్నారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట, ములుగు జిల్లా ఏటూరునాగారం, గోవిందరావుపేటతో పాటు వాజేడు మండలంలోని ధర్మవరం, వాజేడు, ప్రగళ్లపల్లి తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షంతో ధాన్యాన్ని ఆరబోసిన రైతులు ఆగమయ్యారు. కోసేందుకు సిద్ధంగా ఉన్న వరి తడిస్తే తీవ్రంగా నష్టపోతామని పలువురు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

– ఏటూరునాగారం/ గోవిందరావుపేట/ వాజేడు/ నర్సింహులపేట/ చెన్నారావుపేట, డిసెంబర్ 1



చెన్నారావుపేట: ధాన్యపు రాశులపై పరదాలు కప్పుతున్న రైతులు



గోవిందరావుపేటలో కురుస్తున్న వర్షం

## ఏజెన్సీలో ఎన్‌కౌంటర్ అలజడి

- కాల్పులతో దద్దరిల్లిన చెల్పాక-ఐలాపూర్ అడవి
- ఏడుగురు మృతితో చెదిరిన ప్రశాంతత
- మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్ వాసులే..
- అటు ప్రభుత్వ విజయోత్సవాలు..
- ఇటు పీఎల్‌జీఏ వారోత్సవాలు



ఎన్‌కౌంటర్ స్థలంలో మావోయిస్టుల సామగ్రి

# మన్యంలో భయం..భయం

ఏటూరునాగారం, డిసెంబర్ 1 : అటు పీఎల్‌జీఏ వారోత్సవాలు, ఇటు ప్రజా పాలన విజయోత్సవాల నేపథ్యంలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్ ములుగు ఏజెన్సీలో అలజడి సృష్టించింది. సుమారు 15 ఏండ్లకుపైగా నిశబ్దంగా ఉన్న ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో జరిగిన హోరాహోరీ ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారు. భారీగా ఆయుధాలు, సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఐలాపూర్ అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ అనంతరం మావోయిస్టులు చింతగూడెం వద్ద ఆర్టీసీ బస్సును పేల్చివేశారు. ఆదివారం తెల్లవారు జామున మండలంలోని చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతంలో గ్రేహౌండ్స్ పోలీసులు మావోయిస్టుల మధ్య జరిగిన భీకర పోరులో ప్రశాంతంగా ఉన్న పచ్చని అడవి ఎరుపెక్కింది. మావోయిస్టులు గత కొంతకాలంగా ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నారనే సమాచారం మేరకు గొత్తికోయగూడేలపై పోలీసులు నిఘా వేశారు. గత నెల 21న రాత్రి వాజేడు మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి ఉయిక రమేశ్, ఉయిక అర్జున్‌ను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు హత్య చేసి పోలీసులకు సవాల్ విసిరారు. ఇది కాస్త మండల కేంద్రంలోనే జరగడంతో పోలీసులు దీనిని సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తున్నది. ఇదిలా ఉండగా ఈ నెల 2 నుంచి మావోయిస్టులు పీఎల్‌జీఏ వారోత్సవాలు నిర్వహించనున్నారు. ఇక ప్రభుత్వం కూడా ప్రజా పాలన విజయోత్సవ వేడుకలకు శ్రీకారం చుట్టింది.

వారోత్సవాల ప్రారంభానికి ఒకరోజు ముందే భారీ ఎన్‌కౌంటర్ జరగడంతో ఏటూరునాగారం అటవీ ప్రాంతంలో అలజడి చెలరేగింది. ఎప్పుడు ఏం జరుగుతుందోనని గిరిజనం భయాందోళన చెందుతున్నారు. ఈ ఎన్‌కౌంటర్‌లో నర్సంపేట–ఇల్లందు ఏరియా దళ కమాండర్ కుర్సం మంగు అలియాస్ భద్రు అలియాస్ పాపన్న (35), డివిజన్ కమిటీ సభ్యుడు ఎగలోపు మల్లయ్య అలియాస్ మధు (43), ఏరియా కమిటీ సభ్యుడు ముసకి దేవల్ అలియాస్ కరుణాకర్ (22) మృతిచెందినట్లు గుర్తించామని ములుగు ఎస్పీ శబరీష్ తెలిపారు. మరో ముగ్గురిని గుర్తించాల్సి ఉందన్నారు. మృతుల్లో ఒకరైన భద్రుపై ప్రభుత్వం రూ. 20 లక్షల రివార్డును ప్రకటించిన విషయం తెలిసిందే. మృతుల్లో ఆరుగురు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు కాగా, ఎగలోపు మల్లయ్య అలియాస్ మధు పెద్దపల్లి జిల్లాకు చెందినవాడుగా తెలుస్తున్నది. పక్కా సమాచారంతోనే ఎన్‌కౌంటర్ జరిగినట్లు తెలుస్తున్నది. శనివారం రాత్రి రెండు లారీల్లో పోలీసులు చెల్పాక వచ్చినట్లు సమాచారం. ఒక్కసారిగా మావోయిస్టుల డెన్‌పై కాల్పులు జరపడంతో వారు తప్పించుకునేందుకు ప్రయత్నించినట్లు అర కిలోమీటర్ వరకు పడి ఉన్న మృతదేహాలను చూస్తే తెలుస్తున్నది.

### మధ్యాహ్నం ఏడు రౌండ్ల కాల్పులు

ఉదయం ఎన్‌కౌంటర్ జరిగిన తర్వాత ఏడుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించారు. అయితే ఉదయం 10 గంటల వరకు ఎన్‌కౌంటర్ ప్రదేశానికి సుమారు ఆరు కిలోమీటర్ల దూరానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సుమారు 25 మంది ప్రతినిధులు వెళ్లారు. కాగా, 11.48 గంటలకు నాలుగు రౌండ్లు, 12.07 గంటల ప్రాంతంలో మూడు రౌండ్ల కాల్పులు వినిపించాయి. దీంతో ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతుందా? అనే సందేహం వ్యక్తమైంది. ఎందుకోసం ఈ కాల్పులు జరిగాయనే విషయం తెలియలేదు. ఎవరైనా నక్సల్స్ తప్పించుకుంటే పోలీసులు ఇక్కడే ఉన్నారనే సంకేతం ఇచ్చేందుకు గాలిలోకి కాల్పులు జరిపి ఉంటారని విశ్వసనీయ వర్గాల సమాచారం.

**ఏటూరునాగారంలో కేసు నమోదు**

ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందిన సంఘటనపై ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్పీ శబరీష్ తెలిపారు. సుమారు 13 మంది నక్సల్స్ ఉండి ఉంటారని, ఇందులో ఏడుగురు చనిపోగా మిగతా వారు తప్పించుకున్నారని, వారంతా కూడా లొంగిపోవాలని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు.



ఎన్‌కౌంటర్ జరిగిన చెల్పాక-ఐలాపూర్ అటవీ ప్రాంతం

